# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ధర్పల్లి, ఏప్రిల్ 8: ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు పంపించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంతోపాటు హోన్నాజీపేట్ గ్రామంలోఆయన మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించొద్దని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ చేస్తూ రైతులకు త్వరగా ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చూడాలన్నారు. గన్నీబ్యాగ్‌లు, తూకం యంత్రాలు తదితర సామగ్రి అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ వివరాల రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో బాలకృష్ణ, డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీసీవో శ్రీనివాస్‌రావు, ఐకేపీ ఏపీఎం సునీత, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిరికొండ మండలంలోని చిన్న వాల్గోట్, పెద్ద వాల్గోట్ గ్రామాల్లో పర్యటించి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ వాహనాలు తనిఖీ చేస్తుండగా దెగావత్ శివరాం, చొక్కల రాకేశ్, దేశెట్టి సాయికుమార్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని న్యాయస్థానంలో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## వ్యాపారికి రెండు రోజులు..

వినాయక్‌నగర్, ఏప్రిల్ 8: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవీరోడ్డులో ఉన్న శివ శక్తి ఐస్ క్రీం షాపు యజమాని సువాక్ రమేశ్ సోమవారం అర్ధరాత్రి వరకు దుకాణం తెరిచి ఉంచాడు. దీంతో అతడిపై ఎస్‌హెచ్‌వో రఘుపతి కేసు నమోదు చేశారు. అతడిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట మంగళవారం హాజరుపర్చారు. దీంతో ఆమె దుకాణ యజమానికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్‌ఎహెచ్‌వో తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 8: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గండితండాలో చోటుచేసుకున్నది. తండాకు చెందిన విస్లావత్ నరేందర్(43) సోమవారం రాత్రి పొలంలో గేదెలకు నీళ్లు తాగించడానికి చెరువుకు తీసుకెళ్లాడు. పక్కనే ఉన్న చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కంఠేశ్వర్, ఏప్రిల్ 8: ఆర్సపల్లి సబ్‌స్టేషన్ డీ6 సెక్షన్‌లో 33/11 కేవీలో మంగళవారం కొత్తగా 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ రవీందర్, డీఈ ఎం.శ్రీనివాస్ రావు, డి.వెంకటరమణ, డీఈ ఎంఆర్టీ, టౌన్–1 చంద్రశేఖర్, ఎస్పీఎం ఏడీఈ నటరాజ్, తోట రాజశేఖర్, సాయిలు, రావూఫ్, అశోక్, ప్రసాద్‌రెడ్డి, నగేశ్, జాకీర్‌అలీ, గంగాశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

***నేడు విద్యుత్‌లో అంతరాయం..***

కంఠేశ్వర్, ఏప్రిల్ 8: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో బుధవారం 11కేవీ నూతన లైన్ ఏర్పాటు చేయనున్నట్లు ఏడీఈ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు(బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని సూచించారు.

## కాలేజీలు, హాస్టళ్లలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 8: నగరంలోని పలు హాస్టళ్లు, వసతి గృహాల్లో మంగళవారం పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. డివిజన్ పరిధిలో యాంటీ నార్కొటిక్ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 8: హైదరాబాద్ నాంపల్లి కోర్టులో న్యాయవాది మొహ్మద్ ముత్తభాఅలీపై దాడిని నిరసిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తయారు చేయాలని కోరారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డితోపాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు వసంత్‌రావు, పెండం రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (పీజీ) ఏపీఈ/ఐఎంబీఏ/ఐపీసీహెచ్ 6వ, 8వ, 10వ సెమిస్టర్ (థియరీ, ప్రాక్టికల్) రెగ్యులర్/బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీని పరీక్షల నియంత్రణ అధికారి కె.సంపత్‌కుమార్ మంగళవారం ప్రకటించారు. పరీక్ష ఫీజును ఈనెల 15వ తేదీ వరకు, వంద రూపాయల అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఎంఏ (ఏపీఈ) అన్ని సబ్జెక్టులకు రూ.500, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ (ఐపీసీహెచ్) అన్ని సబ్జెక్టులకు రూ.600, ఐఎంబీఏ అన్ని సబ్జెక్టులకు రూ.800 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

## పోషణ పక్షం ప్రారంభం

ఇందల్వాయి, ఏప్రిల్ 8 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గన్నారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు గర్భిణుల బరువు చూడాలని, వారి సంరక్షణపై భర్తలకు అవగాహన కల్పించాలని, రెండేండ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారుల పెరుగుదలను పర్యవేక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభకు సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి శంకర్, వెంకటరెడ్డి, ఆనంద్, శోభ, టీచర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి కమిటీ వ్యవస్థను రద్దుచేయాలని ఆందోళన



కమిషనరేట్ వద్ద ఆందోళన చేస్తున్న తాళ్లరాంపూర్ గౌడ కులస్తులు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 8: గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, వీడీసీ వ్యవస్థను రద్దుచేయాలని కోరుతూ తాళ్లరాంపూర్ గౌడ కుస్తులు ఆందోళన చేపట్టారు. మంగళవారం నిజామాబాద్ తరలివచ్చిన వారు ప్రెస్ క్లబ్ నుంచి పోలీసు కమిషనరేట్ కార్యాలయం వరకు ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా కుంకుమపూజలో పాల్గొనేందుకు వెళ్లిన గౌడ మహిళలను కించపరుస్తూ బయటికి వెళ్లగొట్టారని అన్నారు. వీడీసీ బాధ్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. పోలీసు కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడ బైఠాయించారు. విషయం తెలుసుకున్న స్పెషల్ బ్రాంచ్ అధికారి వారి వద్దకు వచ్చి మాట్లాడారు. వారు ఇచ్చిన వినతిపత్రం తీసుకున్నారు. ఘటనపై విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

## ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 8: మండలంలోని కొండూర్, పాల్దా గ్రామాల్లో ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ 4వ యూనిట్, 1వ బాలుర విభాగం వలంటీర్లు నిర్వహించిన వేసవి శిబిరాలు మంగళవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని వలంటీర్లకు ఎన్‌ఎస్‌ఎస్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటరమణ, నరేశ్‌కుమార్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సేవల్లో లోపం ఉంటే ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్–2 చైర్మన్ నారాయణ

కోటగిరి, ఏప్రిల్ 8: విద్యుత్ వినియోగదారులు, రైతులకు విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే ఫోరంలో ఫిర్యాదు చేయాలని సీజీఆర్‌ఎఫ్–2 చైర్మన్ ఎరుకుల నారాయణ అన్నారు. మంగళవారం కోటగిరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కోటగిరి, పొతంగల్, వర్ని, రుద్రూర్, చందూర్ మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్‌ఎఫ్–2 లోకల్ కోర్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినియోగదారులకు ఏ సమస్య ఉన్నా ముందు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే 1912కు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు పలు సలహాలు, సూచనలు చేశారు. వేదికలో ఒక్క సమస్య కూడా రాకపోవడంతో కోటగిరి అధికారులు, సిబ్బంది పనితీరు బాగుందని అభినందించారు. కార్యక్రమంలో బోధన్ డివిజనల్ ఇంజినీర్ మహ్మద్ ముఖ్తార్, రుద్రూర్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ నగేశ్‌కుమార్, శివాజీ గణేశ్, కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం డబ్బులు ఖాతాలో జమ

పొతంగల్, ఏప్రిల్ 8: మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ అయినట్లు ఏపీఎం బస్వంత్‌రావు మంగళవారం తెలిపారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి మొదటగా డబ్బులు రావడంతో ఉన్నతాధికారులు అభినందించారని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో డబ్బులు రావడంపై రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.

## కొండగట్టుకు పాదయాత్ర

రుద్రూర్, ఏప్రిల్ 8: రుద్రూర్ మండల కేంద్రంలోని హనుమాన్ మాలధారులు మంగళవారం కొండగట్టుకు పాదయాత్రగా తరలి వెళ్లారు. స్థానిక ఆలయంలో ఇరుముడి కట్టుకొని కొండగట్టుకు బయల్దేరారు. శ్యామ్, చంటి, శ్రీను, మనుదీప్, నరేందర్ పాదయాత్ర చేస్తున్నారు.

## పురస్కారాల అందజేత

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 8: ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించినందుకు 29మంది ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. నగరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులకు త్రైమాసిక ప్రగతి చక్రం పురస్కారాలు డిపో–1లో రీజినల్ మేనేజర్ జ్యోత్స్న బహూకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, డిపో మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

కంఠేశ్వర్, ఏప్రిల్ 8: నగర ప్రజలతో పారిశుద్ధ్య వాహనాల డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించాలని కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో పారిశుద్ధ్య వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెత్త తరలిస్తున్న సమయంలో వాహనంలో నుంచి కింద పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రజలతో అమర్యాదగా వ్యవహరించినా, చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ జైకుమార్, ఎస్సైలు, పారిశుద్ధ్య వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వీసీ యాదగిరిరావు తదితరులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి బ్రోచర్లను తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం ఆవిష్కరించారు. టీయూ వీసీ యాదగిరి రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, ఎస్సీ సెల్ డైరెక్టర్ డాక్టర్ వాణి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట చంద్రశేఖర్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఆర్.లింబాద్రి హాజరవుతారని చెప్పారు. 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని కోరారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మోర్తాడ్, ఏప్రిల్ 8: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో మంగళవారం అదే గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. లక్మ రాధకు రూ.21వేలు, వీణకు రూ.54వేల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తెడ్డు కిరిటీ, నోముల నరేందర్‌రెడ్డి, బక్కూరి గోపి, తెడ్డు రాజన్న, గడ్డం భాస్కర్, కట్ట చిరంజీవి, వెంకటేశ్, రాజన్న పాల్గొన్నారు.

**ఆలూర్‌కు చెందిన మహిళకు..**

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్8: ఆలూర్ మండల కేంద్రానికి చెందిన గుండా కళావతికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.35వేలు మంజూరు కాగా బాధిత కుటుంబానికి అందజేసినట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నటరాజ్ తెలిపారు.

## 'కుల బహిష్కరణ.. మానవ హక్కుల ఉల్లంఘన'

ఏర్గట్ల, ఏప్రిల్ 8: తాళ్లరాంపూర్‌లో శ్రీరామ నవమి సందర్భంగా రామాలయంలో పూజ చేయడానికి వచ్చిన గౌడ కులానికి చెందిన మహిళలను వీడీసీ అడ్డుకోవడం బాధాకరమని జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడు గన్నారపు శంకర్ అన్నారు. మంగళవారం ఆయన ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలను ఆలయంలో పూజ చేయకుండా అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. కుల బహిష్కరణ, ఆలయ ప్రవేశాన్ని నిరోధించడం మానవ హక్కుల ఉల్లంఘన, చట్టా రీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆదేశాలను జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## 'నూతన విద్యా విధానాన్ని అమలు చేయొద్దు'

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయొద్దని ఎస్‌ఎఫ్‌ఐ టీయూ ఆరో మహాసభల్లో తీర్మానించారు. మహాసభలు టీయూలోని ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి, సీతారాం ఏచూరీకి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ.. టీయూలో ఇంజినీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు జీషన్, శివ, ఆఫీస్ బేరర్లుగా నాగేంద్ర, నిరంజన సంధ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభలో జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, దినేశ్, సంతోష్ పాల్గొన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం

బాల్కొండ, ఏప్రిల్ 8: కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనం వద్ద అంబలి కేంద్రాన్ని మంగళవారం ఎస్సై నరేశ్ ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు బాటసారులకు అంబలి పంపిణీ చేస్తారు. లయన్స్ క్లబ్ బాధ్యులు సాగర్‌రెడ్డి, చాకు లింగం, దినేశ్ పటేల్, వంశీరెడ్డి, ఇత్వార్‌పేట్ మాజీ సర్పంచ్ గంగారాం, జలాల్‌పూర్ మాజీ సర్పంచ్ గంగారాం పాల్గొన్నారు.

## కిసాన్‌నగర్‌లో కంటి వైద్య శిబిరం

బాల్కొండ, ఏప్రిల్ 8: కిసాన్‌నగర్‌లో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు ప్రవళిక కంటి పరీక్షలు నిర్వహించి, మోతిబిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్స కోసం ఆర్మూర్ లయన్స్ దవాఖానకు తరలించారు. ఎస్సై నరేశ్, లయన్స్‌క్లబ్ బాధ్యులు సాగర్‌రెడ్డి, చాకు లింగం పాల్గొన్నారు.


## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వీరన్నగుట్టలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ మోబిన్‌ఖాన్

మాక్లూర్/రెంజల్/డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: మాక్లూర్ మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి ముత్తెన్న మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, సీసీలు శ్రీధర్‌రెడ్డి, అశోక్, వీవోఏలు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో ఐడీసీఎంఎస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మాజీ ఎంపీపీ మోబిన్‌ఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేశ్‌నాయక్, రెంజల్ విండో మాజీ చైర్మన్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అమృతాపూర్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ప్రారంభించారు.

## హనుమాన్ ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించాలి



సూచనలు చేస్తున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

శక్కర్‌నగర్, ఏప్రిల్ 8: బోధన్ పట్టణంలో ఈనెల 12న నిర్వహించనున్న హనుమాన్ జన్మోత్సవాన్ని, విజయోత్సవ ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాలీలో డీజేలు వినియోగించరాదని సూచించారు. సీసీ కెమెరాలు, డ్రోన్‌ల సహాయంతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సైలు, మారుతీ మందిరం అర్చకులు ప్రవీణ్ మహరాజ్‌తో పాటు హిందూ సంఘాల నాయకులు ఎస్‌ఎస్ఆర్ కోటేశ్వర్ రావు, నక్షత్ర హరికృష్ణ, మాసిని వినోద్ కుమార్, కన్నయ్య, భాను, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

## 'దోస్త్' ద్వారా అడ్మిషన్లు పొందాలి



అడ్మిషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మోర్తాడ్, ఏప్రిల్ 8: మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దోస్త్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న కోరారు. కళాశాలలో మంగళవారం దోస్త్ అడ్మిషన్ బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలలో అన్ని కోర్సులు ఇంగ్లిష్ మీడియంలో ఉన్నాయని, సువిశాలమైన గదులతో ప్రకృతి ఒడిలో అన్ని సౌకర్యాలతో కళాశాల నిర్మించారని, త్వరలో అటానమస్ ప్రారంభం కానుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు ఐదు బృందాలుగా ఏర్పడి మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, వేల్పూర్, మెండోరా మండలాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ మర్రిపల్లి భూపతి, అధ్యాపకులు దశరత్, రాజయ్య, రవీందర్ పాల్గొన్నారు.

*నవీపేట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఇయం గంగాధర్(80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.రాంకిషన్‌రావు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి గంగాధర్ భౌతికకాయంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. గంగాధర్ అంత్యక్రియలకు స్థానిక మహోదయ క్లబ్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. గంగాధర్ అంత్యక్రియల్లో పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.*

*– నవీపేట, ఏప్రిల్ 8*



## న్యూసెన్స్ కేసులో రెండు రోజులు జైలు శిక్ష

మాక్లూర్, ఏప్రిల్8: మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన మండల కేంద్రానికి చెందిన మొద్దు గంగాధర్‌కు కోర్టు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గంగాధర్ మూడు రోజులుగా మద్యం మత్తులో 100కు ఫోన్ చేస్తూ పోలీసుల సమయాన్ని వృథా చేస్తున్నాడు. మద్యం మత్తులో గ్రామంలో న్యూసెన్స్ చేశాడు. దీంతో గంగాధర్‌ను పోలీసులు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట మంగళవారం హాజరుపర్చగా రెండు రోజులు జైలు శిక్ష విధించారు.

## టీస్టాల్ నిర్వాహకుడికి ఒకరోజు..

శక్కర్‌నగర్, ఏప్రిల్ 8: బోధన్ పట్టణంలోని రెంజల్ బేస్‌లోని టీస్టాల్ నిర్వాహకుడు అబ్దుల్ మజీద్‌కు ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ మంగళవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి తీర్పు చెప్పారు. రాత్రి 10.30 గంటల తరువాత టీస్టాల్ నడపవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ సదరు వ్యక్తి రాత్రి సమయంలో హోటల్‌ను కొనసాగించడంతో ఆయనను పోలీసులు మంగళవారం న్యాయస్థానంలో హాజరు పర్చారు. న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రెంజల్, ఏప్రిల్ 8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన నవీపేట మండలం నాగేపూర్ గ్రామానికి చెందిన మద్దెల మదారీ(41) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై చంద్రమోహన్ కథనం మేరకు.. నాగేపూర్ గ్రామానికి చెందిన మద్దెల మదారీ(41) సోమవారం రెంజల్ మండలం నీలాలోని అత్తగారి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. రోడ్డుపైన వడ్ల బస్తాకు బైక్ తగలడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మెరిట్ విద్యార్థులకు ఫీజులో రాయితీ

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 8: పదో తరగతి పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఫీజులో రాయితీ అవకాశాన్ని కల్పించినట్లు కాకతీయ విద్యాసంస్థల అకాడమీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థ స్థాపించి 35ఏండ్లు పూర్తయిన సందర్భంగా, విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఇంటర్‌తోపాటు ఐఐటీ, మెడికల్ కోచింగ్‌లో ఫీజు రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## విజయవంతం చేయాలి

భీమ్‌గల్, ఏప్రిల్ 8: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని విజయవంతం చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ చౌహాన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జేఎంఎల్‌బీసీ సంయుక్త మండల బ్యాంకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. క్రాప్‌లోన్, మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ లక్ష్యం, రికవరీలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్ ఎంపీడీవోలు, బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

## 'ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించాలి'

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 8: మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నాచౌక్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు వనమాల కృష్ణ, ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణ, వెంకన్న, ముత్తెన్న, రాజేశ్వర్, సుధాకర్, సాయన్న, మల్లేశ్, సత్తెక్క, కిషన్, మురళి, రమేశ్ పాల్గొన్నారు.

## రామన్నపేట్‌లో ముందస్తు బడిబాట

వేల్పూర్, ఏప్రిల్ 8: ముందస్తు బడిబాటలో భాగంగా మంగళవారం మండలంలోని రామన్నపేట్ గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గ్రామంలోని 1, 2వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.శివాజీ, నరేందర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, మనోహర్, శ్రీకాంత్, గణేశ్, నరేశ్, శ్యాంచరణ్, గంగాధర్, జ్యోతి, స్రవంతి పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్8: ఆస్తి పన్ను వసూళ్లలో ఆర్మూర్ మున్సిపాలిటీ జిల్లాలోనే మొదటి స్థానంలోనే నిలిచిందని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ డిస్ట్రిక్ట్ ఫోరం సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజును మున్సిపల్ ఎంప్లాయిస్ ఫోరం సభ్యులు మంగళవారం సన్మానించారు.

## నర్సరీల పరిశీలన

భీమ్‌గల్, ఏప్రిల్ 8: మండలంలోని లింగాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, నర్సరీని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈయన వెంట ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఎంపీవో సయ్యద్ జావిద్ అలీ, పంచాయతీ కార్యదర్శి రాకేశ్ ఉన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారం

బోధన్, ఏప్రిల్ 8: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట ఆసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. వినియోగదారులు మొబైల్ నెట్వర్క్ సమస్యలు, ఇంటర్నెట్ సేవల్లో లోపాలు, సిమ్ మార్పులు, బిల్లింగ్ ఇబ్బందులు తదితర సమస్యలను ఆ సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను తక్షణం పరిష్కరించినట్లు ఆ అధికారులు తెలిపారు. శిబిరంలో బీఎస్‌ఎన్‌ఎల్ బోధన్ సబ్ డివిజనల్ ఇంజినీర్ (గ్రూప్స్) కె.వేణుగోపాలచారి, జేటీవో బీబీఎం కె.ఉదయ్‌కుమార్, జేటీవో గ్రూప్స్ సాయిలు, జేటీవో ఎఫ్‌ఎం టి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా.. పలువురికి గాయాలు

ఏర్గట్ల, ఏప్రిల్ 8: తొర్తిలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. వేశాల నగేశ్ తన వ్యవసాయ క్షేత్రంలో పనులు ముగించుకుని మహిళలతో కలిసి తన ట్రాక్టర్‌లో ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని నల్ల చెరువు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## ధాన్యం కుప్పను ఢీకొన్న బైక్.. గిర్దావర్‌కు గాయాలు

రెంజల్, ఏప్రిల్ 8: రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కుప్పను బైక్ ఢీకొన్న ఘటనలో గిర్దావర్ రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రెవెన్యూ అధికారుల కథనం.. గిర్దావర్ రవికుమార్ సోమవారం రాత్రి తహసీల్ కార్యాలయంలో విధులు ముగించుకొని తోటి ఉద్యోగులతో కలిసి నిజామాబాద్‌కు వెళ్తున్నాడు. వీరన్నగుట్ట –దండిగుట్ట గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కుప్పను బైక్ ఢీకొంట్టింది. దింతో బలమైన గాయాలు కావడంతో అంబులెన్సులో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో కూలీకి..

నవీపేట, ఏప్రిల్ 8: మండల కేంద్రంలోని బట్టోడు బాగ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీకి గాయాలైనట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు. ఎస్సై కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాకు చెందిన ఇక్బాల్ హుస్సేన్ భాషా(46) బతుకు దెరువు కోసం భార్యాపిల్లలతో తొమ్మిదేండ్ల క్రితం వచ్చి బినోలా క్రషర్ మిషన్‌లో బండ రాళ్ల బ్లాస్టింగ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తూ నవీపేటకు వస్తున్నాడు. నందిపేట్ నుంచి వస్తున్న మినీ ట్రక్కు వెనకనుంచి ఢీ కొట్టింది. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు జిల్లా దవాఖానకు తరలించారు. బాధితుడి భార్య షేక్ షాహీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.